క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన హరికుమార్‌కు రూ.14,000, అనితకు రూ.14,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరయ్యాయి. మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ వెల్జాల్‌లో బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, దస్తగిరి, రమేశ్, శ్రీశైలం, సుల్తాన్, చెన్నయ్య, రాములు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4వ, 7వ వార్డుల్లో గ్రామ పంచా యతీ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తిచేశామని.. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డుసభ్యులు మహేశ్, గణేశ్, నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, నాగార్జున, మహేశ్, శేఖర్, బీరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన నర్సయ్య (61) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందజేశారు. నర్సయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ అజీం, మాజీ ఎంపీటీసీ రాములు, యాదయ్య, తిరుపతి, రవి, శంకర్, శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు బీజేపీ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌సింగ్



ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన శ్రీకాంత్‌సింగ్‌ను నియమించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత ఆచారి.. శ్రీకాంత్‌సింగ్‌కు నియామకపత్రం అందించారు. అనంతరం శ్రీకాంత్‌సింగ్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో శ్రీకాంత్‌సింగ్ ఆమనగల్లు ఏబీవీపీ కన్వీనర్‌గా, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, కల్వకుర్తి నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్‌గా, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. తనను పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నియమించిన ఆచారి, బీజేపీ నాయకులకు శ్రీకాంత్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, కల్వకుర్తి బీజేపీ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, బీజేపీ నాయకులు రాంరెడ్డి, ప్రశాంత్, చెన్నకేశవులు, శ్రీను, సాయి పాల్గొన్నారు.

సీపీఎం ప్రజాగర్జన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

యాచారం: జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్యగౌడ్ పిలుపునిచ్చారు. యాచారం మండల కేంద్రంలో మంగళవారం ప్రజాగర్జన వాల్‌పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ తదితర నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మస్కు సంజీవ, నాయకులు అలీముద్దీన్, యాదయ్య, రాజునాయక్, రాములు, సత్తయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అన్నా హజారే వర్సిటీలో రైతు బృందం పర్యటన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధిలోని 60 మంది రైతులతో కూడిన బృందం సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టడీ టూర్ నిర్వహించారు. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని రాలేగావ్ సిద్ధి గ్రామంలో ఉన్న అన్నా హజారే వ్యవసాయ ఇనిస్టిట్యూట్‌ను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అన్నా హజారేతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో పర్యటిస్తూ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



అన్నా హజారేతో కలిసి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విఠల్‌రెడ్డి, రైతులు

నెరవేరనున్న విద్యార్థుల కల

శరవేగంగా ఇంటర్ కళాశాల భవన నిర్మాణ పనులు

- ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే
- త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామంటున్న అధికారులు



కొనసాగుతున్న ప్రభుత్వ ఇంటర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.2.50 కోట్లతో జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టారు. 22 ఏళ్లుగా ఇంటర్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తీర్చడానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని భవన నిర్మాణ పనులను వేగవంతంగా జరిగేలా చూస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనైనా కళాశాల భవనం నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

9.15 ఎకరాల స్థలంలో నిర్మాణం...

ఆమనగల్లు పట్టణంలోని మాడ్గుల రోడ్డులో 9.15 ఎకరాల స్థలంలో కళాశాల భవన నిర్మాణం చేపట్టారు. ఆమనగల్లు పట్టణంలో 2001లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించినప్పటికీ సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కళాశాలను నిర్వహిస్తున్నారు. మాడ్గుల రోడ్డులో దివంగత మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి.. దాతల సహకారంతో 9.15 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో 2006లో కళాశాల భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు కావడంతో అప్పటి కేంద్రమంత్రి దివంగత జైపాల్‌రెడ్డి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా కొద్దిరోజులకే కళాశాల కోసం కొనుగోలు చేసిన స్థలం విషయంలో వివాదం రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అదేస్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మించాలని ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు.

రూ.2కోట్లు మంజూరు...

ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో గత ఏడాది భవన నిర్మాణ పనులను విద్యాశాఖామంత్రి సబితారెడ్డి ప్రారంభించారు. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టినప్పటికీ పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇటీవల పనులను ప్రారంభమయ్యేలా చూశారు. దీంతో ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్లకు తోడు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం రూ.2.5 కోట్లతో భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

సొంత భవనం లేక అవస్థలు



ఏళ్లుగా ఇంటర్ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొన్ని గదుల్లో ఇంటర్ కళాశాల తరగతులు నిర్వహించడంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. సొంత భవనం నిర్మించాలని గతంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఫరీద్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు

త్వరలో పూర్తిచేస్తాం



ఇంటర్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. నిధులు ఎన్నైనా కేటాయించడానికి ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తీరుస్తాం.

– అనురాధ, జెడ్పీటీసీ, ఆమనగల్లు



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న నిర్వహించే వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, రైతుబంధు కోఆర్డినేటర్లతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని రైతువేదికలను ముస్తాబు చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా రైతులతో సహపంక్తి భోజనాలు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలపై వివరించాలన్నారు. కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డివిజన్ వ్యవసాయాధికారి సత్యనారాయణ, అధికారులు, రైతుబంధు మండల కోఆర్డినేటర్లు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

అవగాహన సమావేశం..

మంచాల: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంచాల ఎంపీపీ నర్మద అన్నారు. మంగళవారం మంచాలలో అవతరణ వేడుకలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, సూపరింటెండెంట్ జంగయ్యగౌడ్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఎంపీపీ కృపేశ్ అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాలపై ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, రైతుబంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సీడీపీఓ శాంతిశ్రీ పాల్గొన్నారు.

అధికారులతో ఎంపీడీఓ సమీక్ష..

తలకొండపల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2 నుంచి నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ మండల శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ రాజు, ఏఈ కటారియా, ఏపీఓ కృష్ణ, ఏపీయం శ్రీదేవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను బతికించుకుందాం



కళాకారులతో ప్రశాంత్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: కనుమరుగవుతున్న ప్రాచీన కళలను బతికించుకుందామని ప్రముఖ సంఘసంస్కర్త నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో సోమవారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి చరిత్ర స్టేజి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో స్టేజి నాటకాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులకు వ్యక్తిగతంగా రూ.21,000 అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్, నాటక బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహిద్దాం..

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను ప్రోత్సాహించాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి స్టేజి నాటకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాఘవేందర్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులచే రూ.10,000 కళాకారులకు అందజేశారు. కార్యక్రమంలో మహేష్, భరత్‌రెడ్డి, కిషన్, రాఘవేందర్, హైమద్, రత్నయ్య, శ్రీను, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నా భాగం నాదే.. మీ భాగం మీదే..

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న తక్కళ్లపల్లి సర్పంచ్ వసూళ్ల వ్యవహారం



పంచాయతీ సమావేశంలో నా భాగం నాదే.. మీ భాగం మీదే అంటున్న సర్పంచ్ సంతోష

యాచారం: 'నా భాగం నాదే.. మీ భాగం మీదే.. గ్రామంలో 20 ఎకరాల వెంచర్ చేయడానికి డీటీసీపీ అనుమతులకు వెళ్లారు. మనం తీర్మానం చేసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేసి వారి (రియల్ వ్యాపారుల) వద్దకు వెళ్దాం.. నక్కర్తమేడిపల్లిలో తీర్మానం చేసి ఏ విధంగా డబ్బులు తీసుకుని ఐక్యంగా ఉన్నారో.. మనం కూడా అలానే ఉండాలి' అంటూ తక్కళ్లపల్లి సర్పంచ్ కంబాలపల్లి సంతోష మాట్లాడిన మాటలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నాభాగం నాదే.. మీ భాగం మీదే అనే సమయంలో వార్డు సభ్యులు సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశంగా మారింది. అక్రమ వసూళ్లపై సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో పాటు పలు టీవీ చానళ్లలో సైతం ప్రసారం అయ్యింది. ఇదే విషయమై సర్పంచ్ సంతోషను వివరణ కోరగా తన మాటలు ఎవరో ఎడిటింగ్ చేసి, తనను బదనాం చేయాలని కుట్రలు చేస్తున్నారని పేర్కొంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎంపీపీ కృపేశ్ తదితరులు

• ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. లైఫ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ ఆవరణలో మంగళవారం మొక్కలను నాటారు. వర్షాలు సంవృద్ధిగా పడేందుకు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు చెట్లు ఎంతో ముఖ్యమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓక్రాంతికిరణ్, మండల రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, సీడీపీఓ శాంతిశ్రీ, ఎస్ఐ కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన..

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన పర్యావరణహిత జీవనశైలిపై గ్రామ ప్రజలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు నాయకులు, నరేందర్‌రెడ్డి, భిక్షపతి, మహేశ్, మల్లయ్య, మహేశ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆదిబట్ల ఎస్ఐ సురేష్‌కుమార్ బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన సురేష్‌కుమార్ మంగళవారం పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. కాగా ఆయన స్థానంలో రెండు రోజుల క్రితం సీసీఎస్ ఎల్‌బీనగర్ నుంచి ఎం.శ్రీనివాస్‌రావు, వెంకటేశ్ వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి ఆదిబట్ల పీఎస్‌కు బదిలీపై వచ్చారు. ఎస్ఐ సురేష్ కుమార్ ఆదిబట్లలో పనిచేసిన కాలంలో క్రైం విభాగంలో తనదైన ముద్ర వేశారు.

వెల్జాల్‌లో చలివేంద్రం ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మహిళలు, ప్రయాణికులు, చిన్నారులు, వృద్ధుల దాహం తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, స్వామి, నందు, యాదగిరి, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు రూ.50వేల విరాళం



విరాళం అందజేస్తున్న నిత్యారెడ్డి

మంచాల: మంచాల మండల పరిధిలోని సత్యం తండాలో బొడ్రాయి పండుగను జూన్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశానుసారం మంగళవారం మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి ఉత్సవ నిర్వహణ కమిటీకి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. తండాలో బొడ్రాయి పండుగ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం తండా సర్పంచ్ పెంట్యానాయక్, ఉపసర్పంచ్ జ్యోతి బాలునాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

• బీజేపీ సీనియర్ నేత మదన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్

ఇబ్రహీంపట్నం: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మదన్‌మోహన్‌గుప్తా అన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీజేపీ కార్యవర్గ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలం అధ్యక్షతన మంగళవారం స్థానిక వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు ప్రతాప్, నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, మల్లేష్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

తండాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

• ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తండాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. ఆమనగల్లు మండల పరిధిలోని శంకరకొండతండా, దయ్యాలబోడు తండా, మేడిగడ్డతండా, చెప్ట తండాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా తండాలలో ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ దేవాలయాల్లో ఆయన పూజలు నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. దయ్యాలబోడుతండాలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెప్టతండాలో గాలివానకు దెబ్బతిన్న నేనావత్ జగన్ ఇంటి నిర్మాణానికి సాయమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడిగడ్డతండా ఉపసర్పంచ్ మల్లేశ్, స్థానిక నాయకులు చంద్రునాయక్, రాజునాయక్, టాక్యా, అంజ్యా, భీమ్లా, రమేశ్, ఈశ్వర్, శ్రీను, నవీన్, హనుమంత్, ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి: చైర్మన్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయలతో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో జల్‌పల్లి మున్సిపాలిటీ రూపురేఖలు మారుతున్నాయని చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. 9వ వార్డులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... షా హిల్స్ కాలనీ నుంచి వాదే-ఉమర్ కాలనీ వరకు 520 మీటర్ల మేర నిర్మిస్తున్న ఈ రహదారి అందుబాటులోకి వస్తే స్థానికులకు ఎంతో వెసులుబాటుగా మారనుందన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగతున్నాయన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. గడిచిన మూడేళ్లలో జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, షాహిన్‌నగర్, కొత్తపేట, ఎర్రకుంట పరిసరాల్లో పెద్దఎత్తున సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు విస్తరణపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ పార్టీ నాయకులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్ గౌడ్

మహేశ్వరం: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి అధ్యక్షతన మంగళవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె ప్రగతి కింద నిధులు వస్తున్నాయన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. మహేశ్వరంలో కమలం వికసించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్ శర్మ, కడారి జంగయ్య, అనంతయ్య గౌడ్, దేశ్యానాయక్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు యాదిష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు నందీశ్వర్, బుగ్గని శంకర్, నాయకులు ముత్యం, భూపాల్‌రెడ్డి, ఆదిలక్ష్మీ, శ్రవణ్, శ్రీనివాస్, అనిత పలువురు పాల్గొన్నారు.